క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని కేంరాజ్ కల్లాలి గ్రామంలో పంట కాలువలో పూడికతీత పనులను మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. పోచారం ప్రాజెక్టు డీ–5 కాలువలో మట్టి పూడికతీత పనుల తీరును తెలుసుకున్నారు. మట్టి పూడిక తీస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని, కూలి గిట్టుబాటు అవుతుందని ఎంపీడీవో అన్నారు.

పెద్ద వర్షాలు పడ్డాకే విత్తనాలు వేయాలి

బిచ్కుంద(జుక్కల్): రైతులు ఇప్పుడే విత్తనాలు విత్త వద్దు రెండు, మూడు పెద్ద వర్షాలు పడిన తర్వాతనే విత్తుకోవాలని ఏడీఏ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. చిన్నపాటి వర్షాలకు భూమి పూర్తి స్థాయిలో నీటితో తడవదని, మట్టిలో నీటి తేమ లేక విత్తిన విత్తనాల మొలకెత్తదని అన్నారు. అదును దాటిపోతుందని రైతులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, మొలక రాక ఆర్థికంగా నష్టం జరుగుతుందన్నారు.

అంగన్‌వాడీ భవనానికి మరమ్మతులు చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హరిజనవాడ అంగన్‌వాడి కేంద్ర భవనానికి మరమ్మతులు చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నాసిరకంగా నిర్మించడంతో ప్రారంభం కాకముందే ఆ భవనానికి పగుళ్లు ఏర్పడ్డాయన్నారు. దీంతో అధికారులు ఇప్పటివరకు భవనాన్ని ప్రారంభించలేదు. ప్రస్తుతం అంగన్‌వాడి కేంద్రాన్ని అద్దె భవనంలో నడిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ భవనానికి మరమ్మతులు చేయించి, అందులో అంగన్‌వాడి కేంద్రాన్ని ప్రారంభించి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి



ఎల్లారెడ్డి: ఈనెల 20న నిర్వహించే నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శరత్ అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో నిర్వహించిన ఆరోగ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి వాటిని మింగేలా చూడాలని అన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



బాన్సువాడ: బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గొంతు, రొమ్ము క్యాన్సర్, చెవి, ముక్కు, గర్భ సంచికి సంబంధించిన వైద్య పరీక్షలను వైద్యులు స్వాతి చేశారు. వర్షకాలం దృష్ట్యా మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని, పంట పొలాల్లో నిల్వ ఉండే నీళ్లు తాగవద్దని సూచించారు. కాచి వడబోసిన నీటినే తాగాలని అన్నారు. సూపర్‌వైజర్లు నర్సమ్మ, సుశీల తదితరులు ఉన్నారు.

వర్షాల కోసం పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో వర్షాల కోసం మంగళవారం పూజలు చేశారు. గ్రామంలో తిరుగుతూ కప్పకావుడి ఆటలు ఆడారు. అలాగే బిందెలో కప్పను ఉంచి బందె చుట్టూ తిరుగుతూ వానపాటలు పాడారు. బతుకమ్మ ఆటలు ఆడారు. వర్షాలు కురవాలని వరుణుడిని వేడుకున్నారు. ఐదు రోజుల నుంచి వర్షాలు లేక మొలసిన పత్తి, సోయా, మొక్కజొన్న మొలకలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగితాల్లోనే ఆలయ భూములు

- కబ్జాలకు కేరాఫ్‌గా మారిన రాజంపేట
- పట్టించుకోని రెవెన్యూ, దేవాదాయ శాఖాధికారులు



రాజంపేటలోని వేంకటేశ్వర ఆలయం



దేవాదాయ శాఖకు చెందిన భూమి

రాజంపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయానికి చెందిన భూములు కబ్జాలకు గురవుతున్నాయి. వేంకటేశ్వర ఆలయానికి చెందిన సాగు భూమి రికార్డు ప్రకారం సర్వే నెంబర్–516, 478, 484, 482, 491, 438లలో మొత్తం 14 ఎకరాల 3 గుంటల భూమి ఉంది. కాని ప్రస్తుతం సాగు అవుతున్న భూమి 5 నుంచి 6 ఎకరాలు మాత్రమే ఉంటుందని రైతులు చెబుతున్నారు. అయితే ఈ సాగు భూమికి దేవాదాయ శాఖ ప్రతి ఏడాది వేలం పాటను నిర్వహిస్తోంది. ప్రతి సంవత్సరం ఎండోమెంట్ అధికారులు ఈ భూమిని వేలం పాట వేస్తారు. రికార్డు ప్రకారం 14 ఎకరాల మూడు గుంటలు ఉన్నప్పటికీ సాగులో 5 నుంచి 6 ఎకరాలు మాత్రం ఉంటుందని స్థానిక రైతులు చెబుతున్నారు. ఈ భూమికి సంబంధిత అధికారులు ప్రతి ఏటా వేలంపాట నిర్వహించి అధికారులు దులుపేసుకుంటున్నారు.

మిగతా భూమి ఏమైంది?

5 నుంచి 6 ఎకరాల ఆలయ భూమిలోనే సాగు చేసుకుంటున్నామని రైతులు పేర్కొంటున్నారు. కబ్జాలకు గురైందా లేదా బడాబాబుల చేతులో ఉందా లేక రాజకీయ నాయకుల చేతుల్లో ఉందా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. వేలం పాటలో చెప్పేది ఒక భూమి. అక్కడ కనిపించేది మరొక భూమి అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయానికి సంబంధించిన భూముల వివరాలు పూర్తిగా బయట పెట్టాలని అదే విధంగా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు సర్వే చేపట్టి భూములను కాపాడాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అసలు భూముల లెక్క ఎంత..?

రాజంపేట మండల కేంద్రంలో వేంకటేశ్వర ఆలయంతో పాటు సంగమేశ్వర ఆలయం, రాజరాజేశ్వర ఆలయానికి సంబంధించిన భూములున్నట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. వీటికి సైతం భూములున్నట్లు రెవెన్యూ రికార్డులో ఉంది. ఈ ఆలయాలకు సంబంధించి సుమారు 21 ఎకరాల భూమి ఉన్నట్టు రికార్డులో ఉంది. కాని ఆ భూములు కాగితాల్లో తప్ప వాస్తవంగా ఎక్కడ ఉన్నాయో, వాటిని ఎవరు వాడుకుంటున్నారో గ్రామస్తులకు అంతు చిక్కడంలేదు. ఏదిఏమైనా ప్రభుత్వ భూములు, ఆలయ భూముల విషయంలో రాజంపేట మండల కేంద్రం భూవివాదాలకు నిలయంగా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. అధికా రులు స్పందించాల్సి ఉంది.

ప్రభుత్వ భూములను కాపాడాలి



రాజంపేట మండల కేంద్రంతోని అన్ని ఆలయాల భూములను ప్రభుత్వం కాపాడాలి. దీనిపై ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి సర్వే చేపట్టాలి. దేవాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు ప్రత్యేకంగా సర్వే చేసి భూములను స్వాధీనం చేసుకోవాలి. కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

– పందుల చిన్న స్వామి, రాజంపేట

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- బాన్సువాడ, బీర్కూర్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు



స్టాక్‌ను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

బాన్సువాడ : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ బృందం, బిచ్కుంద ఏడీఏ ప్రసన్న లక్ష్మి హెచ్చరించారు. మంగళవారం బాన్సువాడ, బీర్కూర్ పట్టణాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తనాల బిల్లులు, స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, లైసెన్స్ అందుబాటులో ఉంచాలని, రైతులకు కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, రసీదు తప్పకుండా ఇవ్వాలని డీలర్లకు సూచించారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు కొనాలని, విడిగా అమ్మే విత్తనాలను కొనుగోలు చేయవద్దని, తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచించారు. ఏడీఏ సుధాకర్, మద్నూర్ ఏవో రాజు, బిచ్కుంద ఏవో రాజలింగం, బీర్కూర్ ఏవో కమల తదితరులు ఉన్నారు.

‘మున్నూరుకాపులను ఎన్నికలకు చైతన్యం చేయాలి’



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్నూరుకాపు నేతలు

కామారెడ్డి అర్బన్: రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో మున్నూరుకాపులు ఎక్కువ సంఖ్యలో పోటీ చేయడానికి చైతన్యపరుస్తున్నట్లు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. మంగళవారం సంఘం జిల్లా భవనంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నీలం నర్సింలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంఘం జిల్లా ప్రతినిధుల సమావేశంలో కొండ దేవయ్య పటేల్ మున్నూరుకాపు జన చైతన్య యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మున్నూరుకాపుల గెలుపు కోసం పార్టీలకు అతీతంగా కృషి చేయాలని సూచించారు. సంఘం జిల్లా న్యాయ సలహాదారులుగా అడ్వకేట్ కాసర్ల శ్రీనివాస్ పటేల్‌ను నియమించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, మహిళా అధ్యక్షురాలు బి.లలిత, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కూల్‌బ్యాగుల పంపిణీ



పాఠ్య సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

బాన్సువాడ రూరల్: తమ పాప రియాన్సిక అక్షరాభ్యాసం సందర్భంగా దుర్కి గ్రామానికి చెందిన సిద్ధార్థ –అతిథి దంపతులు దేశాయిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ద విద్యార్థులకు పాఠ్యసామాగ్రి పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, పలకలను ఉచితంగా పంపిణీ చేశారు. చక్కటి ఆలోచనతో పేద విద్యార్థులకు సాయం అందించిన దంపతులిద్దరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జాగృతి, ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా సన్మానించారు. సిద్ధార్థ–అతిథిలను ఆదర్శంగా తీసుకుని పేద విద్యార్థులకు సాయం అందించాలని కోరారు. జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గోలి నరేందర్, ఉపాధ్యాయులు సంగమేశ్వర్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి పాఠశాలలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అక్షరభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో అక్షరభ్యాసం చేయించారు. అలాగే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం కవిత, ఏపీసీ చైర్మన్ సావిత్రి, ఉపాధ్యాయులు ఉదయ, శరణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరేడ్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో..

నిజాంసాగర్(జుక్కల్): ఆరేడ్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ముందుగా చదువుల తల్లి సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేసి కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడి టీచర్లు ప్రమీల, మైశకల, పుష్పలత, ఐకేపీ సీఏ నాగరాణి, మదర్స్ కమిటీ మెంబర్ దుర్గాభవాని తదితరులు ఉన్నారు.

‘ఎమ్మెల్యే పోచారంను కాంగ్రెస్‌లోకి రానివ్వం’



బీర్కూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ: మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రానివ్వమని కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వరాజ్ అన్నారు. మంగళవారం బీర్కూర్ మార్కెట్ కమిటీలో మాట్లాడారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నట్లు వార్తలు వచ్చాయని, ఆ వార్తలను పోచారం ఎందుకు ఖండించడం లేదని అన్నారు. పోచారంను కాంగ్రెస్ పార్టీలోకి రాకుండా సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్తామని, కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి సేవ చేసిన వారికే పార్టీలో ఉండే అవకాశం ఉంటుందని అన్నారు. నాయకులు బోయిని శంకర్, అబ్దుల్ అహ్మద్, సానేపు గంగారం, కమలాకర్‌రెడ్డి, యామ రాములు, ఇక్బాల్ తదితరులున్నారు.

అలుగు నిర్మాణ పనులను పూర్తి చేస్తాం



పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మోహన్ రెడ్డి

రామారెడ్డి: గత వర్షాకాలంలో మండల కేంద్రంలోని కన్నయ్య చెరువు అలుగుకు బుంగపడి చెరువులోని నీరు ఖాళీ అయినా అప్పటి బీఆర్ఎస్ సర్కార్ స్పందించలేదని, కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాంగానే రూ.4 లక్షల నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామని రామారెడ్డి జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రామారెడ్డి కన్నయ్య చెరువు అలుగు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ సర్కార్ చేయని పనులను కాంగ్రెస్ సర్కార్ పూర్తి చేస్తుందన్నారు. వర్షాలు పడి చెరువు నిండే లోపు అలుగు నిర్మాణ పనులను పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న గంగళ్ల రవీందర్

భిక్కనూరు: మండల కేంద్రంలోని పాత దళితవాడలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ ఆధ్వర్యంలో భిక్కనూరు తహసీల్దార్ శివ ప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. పాత దళితవాడలో మూడు వందలకు పైగా కుటుంబాలు ఉన్నాయని వీరదంరూ ప్రతి నెలా రేషన్ సరుకుల కోసం ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉన్న భిక్కనూరు మండల కేంద్రానికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇబ్బంది అవుతోందని, వెంటనే పాత దళితవాడలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వారు కోరారు.

జోరందుకున్న వరి నాట్లు



అంకోల్ తండాలో నాట్లు వేస్తున్న కూలీలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలో వరి నాట్లు జోరందుకున్నాయి. వర్షాలు పడటం ప్రారంభం అవ్వకున్నా కూడా బోర్లతో తడిపి నాట్లు పూర్తి చేసుకున్నారు. ఒక వైపు వర్షం కోసం ఎదురు చూస్తూనే నాట్లు వేస్తున్నారు. బోర్లు ఎత్తి పోతున్నాయని, వర్షాలు సకాలంలో పడకపోతే నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని కొంత మంది రైతులు వాపోతున్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు నాట్లు చురుకుగా వేస్తున్నారు. దీనితో కూలీల కొరత సమస్య తీరినా వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి.

సొంత డబ్బులతో పైపులైన్ పనులు

దోమకొండ: అంబారిపేట గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రామానికి చెందిన యువకుడు అరుట్ల అనిల్ తన సొంత డబ్బులతో పైపులైన్ పనులు చేశారు. ట్రాక్టర్ డోజర్‌తో పాఠశాల పైపులైన్ పనులు, ఆవరణలో పిచ్చిమొక్కల తొలగింపు, టాయిలెట్స్ వద్ద నీటి సదుపాయానికి పైపులైన్ గుంతలు తీయించినట్లు ఈ సందర్భంగా అనిల్ తెలిపారు. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావ్, గ్రామస్తులు అరుట్ల రమేష్, లక్ష్మీపతి, నరసింహం, రాజిరెడ్డి, దిడ్డి రవి, మ్యాకల రవి, పాఠశాల కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్ పుట్ట భాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఒకరు లేదా ఇద్దరు మాత్రమే మొదటి ర్యాంకు సాధిస్తారు. కాని ఈ ఏడు ఏకంగా 60 మందికి మొదటి ర్యాంకు రావడంలో అందులో ఒకే సెంటర్‌లో 8 మందికి రావడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. నిష్పక్షపాతమైన విచారణ జరిపి చర్యలు తీసుకుని నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలన్నారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో బోనాల పండగ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అడివిలింగాల గ్రామంలో మంగళవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని ఎల్లమ్మ, భూలక్ష్మమ్మ అమ్మవారికి గ్రామస్తులు బోనాలతో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు.

ఘనంగా నరసింహ హోమం



మాచారెడ్డి: చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం నరసింహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి దంపతులు, ఎంపీటీసీ రూపాదేవి, కృష్ణమూర్తి దంపతులతో పాటు మరో 11 జంటలు హోమంలో పాల్గొన్నారు. ఈవో శ్రీధర్ రావు, అర్చకులు, గ్రామస్తులు ఉన్నారు.

కచ్చితంగా సర్వే నిర్వహించాలి



మాట్లాడుతున్న వైద్యురాలు యెమిమా

భిక్కనూరు: ప్రతి ఆశా వర్కరు తనకు కేటాయించిన ప్రాంతంలోని అన్ని ఇళ్లలో ఆరోగ్యం విషయంలో సర్వే నిర్వహించాలని భిక్కనూరు ప్రభుత్వ వైద్యురాలు యెమిమా అన్నారు. మంగళవారం భిక్కనూరు పీహెచ్‌సీ నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 ఏళ్లు పై బడిన వారందరికి క్షయ వ్యాధి రాకుండా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఏఎన్ఎంలకు, అంగన్‌వాడి టీచర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. జూన్ 20న నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 19 ఏళ్ల లోపు పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలను అందించాలని సూచించారు. ఆ రోజు అందుబాటులో లేని పిల్లలకు జూన్ 27న వేయాలన్నారు. వైద్యుడు ఆదర్శ, ఎంపీహెచ్ ఈవో వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పట్టా సాధించిన కల్పన



ఆసం కల్పన

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ఆసం కల్పనకు డాక్టరేట్ పట్టాను రాజస్థాన్‌లోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయం మంగళవారం ప్రకటించింది. మండల కేంద్రం సమీపంలోని అహ్మద్ బీఈడీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఆసం కల్పన ‘ఎంపిరికల్ స్టడీ ఆన్ డెవలప్‌మెంట్ ఆఫ్ కెరియర్ ప్లానింగ్ విత్ రిస్పెక్టు టు కంటిన్యూయేషన్ ఆఫ్, హోమ్ ఎన్విరాల్‌మెంట్ అండ్ లెవెల్ ఆఫ్ ఎంబీసీయస్’ అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ జగదీష్ బాబులాల్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనలను సన్‌రైజ్ విశ్వవిద్యాలయానికి సమర్పించింది. విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఆమె సమర్పించిన పరిశోధనలకు సంతృప్తి చెంది డాక్టరేట్ పట్టాను అందజేశారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం



లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట గ్రామానికి చెందిన హరిజనవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం జ్ఞాన వికాస భారతి క్రీడా సాహితి సాంస్కృతిక సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెన్నులు, పెన్సిళ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ సంస్థ నుంచి విద్యా రంగానికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, శ్వేత, సంస్థ ప్రతినిధులు రామానుజాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు మండల కాంగ్రెస్ సమావేశం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశం ఉందని మండల పార్టీ అధ్యక్షుడు నందు రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకుని వచ్చామని, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ రూపొందిస్తామని, ప్రతి కార్యకర్త హాజరవ్వాలని కోరారు.

రేపు మాచారెడ్డి మండల సభ

మాచారెడ్డి: మాచారెడ్డి మండల సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపి బాబు మంగళవారం తెలిపారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న మండల సభకు ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

21న శ్రీలలితా సహస్రనామ పారాయణం

కామారెడ్డి అర్బన్: స్థానిక విద్యానగర్ కాశీ విశ్వనాథేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21న సామూహిక శ్రీలలితా సహస్ర నామ పారాయణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ కోరింది.

25న బాన్సువాడ తైబజారుకు వేలం

బాన్సువాడ: ఈ నెల 25న బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో తైబజారుకు వేలం వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. వారాంతపు సంత, రోజువారి సంత, పశువుల దాఖలు, మేకలు, గొర్రెల సంతలకు వేలం వేయనున్నట్లు ఆయన తెలిపారు. వేలం పాటలో పాల్గొనే కాంట్రాక్టర్లు రూ.10 వేల డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి ఇవ్వరని వెల్లడించారు. వేలం పాటలో సంతలు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మూడు రోజుల్లో 50 శాతం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు మున్సిపాలిటీ నుంచి నో డ్యూస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి: పండ్ల తోటల పెంపకానికి గ్రామ పంచాయతీల్లో చిన్న, సన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని రామారెడ్డి ఎంపీడీవో సవిత మంగళవారం తెలిపారు. ఎంపీడీవో సవిత మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు గ్రామ పంచాయితీలో తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండి సొంత బావి, బోర్‌బావి ఉండి వ్యవసాయ భూమి 5 ఎకరాలకు లోపు ఉన్న రైతులు అర్హులన్నారు.

కేస్ వర్కర్ పోస్టుకు..

కామారెడ్డి క్రైం: పద్మఫణి సొసైటీ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలోని సఖి కేంద్రంలో కేస్ వర్కర్ పోస్టును భర్తీ చేయడానికి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కే. సత్యనారాయణ రెడ్డి మంగళవారం తెలిపారు. న్యాయవాద విద్య, సోషల్ వర్క్, సోషల్ సైన్స్, సైకాలజీలలో ఏదేని డిగ్రీ, ఉమెన్ రిలేటెడ్ ప్రోగ్రామ్స్‌లో 3 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. స్థానిక మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 08468 223232, 73862 76181 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.